ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



స్థానికులతో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ శ్రీకాంత్

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

హఫీజ్‌పేట్: తమ దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ స్పష్టం చేశారు. హఫీజ్‌పేట్‌లోని 'కేఎస్‌ఆర్ టుగెదర్‌మెంట్స్, అపార్ట్‌మెంట్స్ అసోసియేషన్' ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అపార్ట్‌మెంట్ వాసులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కేఎస్‌ఆర్ టు గెదర్‌మెంట్ అపార్ట్‌మెంట్స్ ఇబ్బందులు, సమస్యలను పరిగణనలోకి తీసుకుని పరిష్కరించేందుకు చొరవ తీసుకుంటామన్నారు. పార్కు, మౌలిక వసతులు, తాగునీటి సమస్య, విద్యుత్ దీపాల సమస్యలను కూడా పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా అపార్ట్‌మెంట్ వాసులు మంజీరా తాగునీటి సమస్యను తీర్చాలని, బిల్డర్ పేరు చెప్పి ప్రైవేటు వ్యక్తులు వచ్చి ఇబ్బందులకు గురిచేస్తూ.. మనశ్శాంతి లేకుండా చేస్తున్నారన్నారు. దీంతో పలు సమస్యలను వారు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ప్రతి సమస్య పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు బాలింగ్ గౌతమ్‌గౌడ్, నాయకులు, అపార్ట్‌మెంట్ వాసులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

రాయదుర్గం: జీవనశైలి, వాతావరణంలోని మార్పులతోనే వ్యాధులు వస్తున్నాయని వైద్యాధికారులు తహజబీన్, తేజస్వి, సుమన్ అన్నారు. నానక్‌రాంగూడ స్టార్ ఆస్పత్రి, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్తాధ్వర్యంలో శారద హైస్కూల్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరోగ్యమే మహాభాగ్యమని అంటారని, అందువల్ల కొన్ని జాగ్రత్తలు తీసుకున్నచో మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందన్నారు. ప్రతినిత్యం వ్యాయామం, మెడిటేషన్, యోగ, ధ్యానం, నడక కనీసం 40 నిమిషాలు చేయాలని సూచించారు. సాధ్యమైనంతవరకు తాజా ఆకు కూరలు, సీజనల్ పండ్లు, పాలు, పాల ఉత్పత్తులు, చేపలు,గుడ్లు, తృణధాన్యాలు, డ్రైఫ్రూట్స్ వంటి పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. సాధ్యమైనంతవరకు ఆల్కహాల్, పొగాకు, ఇతర మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనారోగ్యంపై శ్రద్ధ చూపుతూ.. వైద్యుల సూచనలు, సలహాలను విధిగా పాటించాలన్నారు. ఈ సందర్భంగా 105 మందికి ఎత్తు, బరువు, రక్తపోటు, షుగర్, పల్స్, కంటి, దంత, బీఎండీ పరీక్షలతో పాటు ఈసీజీ పరీక్షను నిర్వహించారు. అనంతరం శ్రీ నేత్రాలయ కంటి వైద్యశాల ఆధ్వర్యంలో కంటి వైద్య పరీక్షలను చేశారు. స్కూల్ కరస్పాండెంట్ బంద నరేంద్ర బాబు, సభ్యులు అన్నయ్య చౌదరి, వాణిసాంబ శివరాలు, సుబ్రహ్మణ్యం, కామేశ్వరరావు, రాజుగౌడ్, ఆస్పత్రి ప్రతినిధి జాకీర్ హుస్సేన్, స్టార్ ఆస్పత్రి, నేత్రాలయ వైద్య సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.



శారద స్కూల్లో ఉచిత వైద్య పరీక్షలను నిర్వహిస్తున్న దృశ్యం

పేదలకు అందుబాటులో వైద్య సేవలు



వైద్య శిబిరంలో వాలంటీర్లకు జ్ఞాపికను అందిస్తున్న నిర్వాహకులు

గచ్చిబౌలి: పేదలకు వైద్య సేవలను అందించేందుకు గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో స్వేచ్ఛ, కేర్ అండ్ కేరీర్ చారిటీ, ఎస్‌వీకే సంస్థలు సంయుక్తంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్లు పేదలకు వైద్య సేవలను అందించారు. గచ్చిబౌలి పరిసరాల్లోని స్లమ్ ఏరియా ప్రజలే కాకుండా నగర శివారులోని వారు కూడా రైళ్లలో వచ్చి వైద్య సేవలను పొందడం విశేషం. ఈ సందర్భంగా పలువురు వైద్య సేవలను అందిస్తూ.. ప్రజలకు తగిన సలహాలు, సూచనలు కూడా ఇచ్చారు. ఆరోగ్యంపై ఎలా శ్రద్ధ తీసుకోవాలో వివరించారు. అనంతరం నిర్వాహకులు వైద్య శిబిరంలో సేవలందించిన డాక్టర్లు, వాలంటీర్లుగా పనిచేసిన వారికి మెమోంటోను అందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 9వేల మందికి పైగా వైద్య సేవలు అందించగా కంటి ఆపరేషన్లను 100 మందికి చేయడం విశేషం, ఇప్పటి వరకు 50 మంది వైద్యులు, వందలాదిమంది వాలంటీర్లుగా రెగ్యులర్‌గా పాల్గొంటున్నారన్నారు.

ఘనంగా ప్రబల తీర్థం వేడుకలు

- నల్లగండ్లలోని అపర్ణ సరోవర్‌లో సందడి
- ప్రత్యేక ఆకర్షణగా చిన్నారుల దేవతా మూర్తుల వేషధారణ



అపర్ణ సరోవర్‌లో ప్రబల తీర్థం వేడుకల్లో ప్రబల్లో ఊరేగిస్తున్న దృశ్యం

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నల్లగండ్లలోని అపర్ణ సరోవర్‌లో ప్రబల తీర్థం వేడుకలను ఆదివారం కనులపండువగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా అపర్ణ సరోవర్‌లో గ్రామీణ వాతావరణం స్పష్టంగా కనిపించింది. గ్రామీణ ప్రాంతాల్లో వేడుకల్లో భాగం నిర్వహించే తిరనాళ్లు, గ్రామీణ వంటకాలు, క్రీడలు, రంగుల రాట్నం, చిలుక జోష్యం తదితర దృశ్యాలు కనిపించాయి. 400 ఏళ్లుగా కోనసీమలో ఈ వేడుకలను నిర్వహించే సాంప్రదాయం ఉందని సరోవర్ వాసులు పేర్కొన్నారు. ఏకాదశ రుద్రులను ఒకేచోట చేర్చి పూజించడం వేడుకల ప్రాధాన్యతగా వివరించారు.

- శివపార్వతులను ప్రబల్లో ఏర్పాటు చేసి అపర్ణ సరోవర్‌లో ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. ఈ ఊరేగింపులో చిన్నారులు, సరోవర్ వాసులు పెద్ద ఎత్తున పాల్గొనడంతో పండుగ వాతావరణం నెలకొంది. 2016 నుంచి అపర్ణ సరోవర్‌లో ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నారు.
- దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు ఉన్నప్పటికీ ఈ వేడుకల్లో అందరూ ఉత్సాహంగా పాల్గొనడం విశేషం. కళాకారులు చిన్నారులకు దేవతా మూర్తుల వేషధారణలు వేశారు. దీంతో వారు ఈ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ప్రబల తీర్థం విశిష్టత...

కోనసీమలో ప్రబల తీర్థం వేడుకలకు 400 ఏళ్ల చరిత్ర ఉందని నిర్వాహకులు చందన తెలిపారు. జగ్గన్నతోట వద్ద జరిపే ఈ వేడుకల్లో ఏకాదశ ప్రభలు 11 గ్రామాల నుంచి తరలి వస్తాయి. ఈ ప్రబలన్నీ జగ్గన్నతోట వద్ద కలిసి తీర్థం జరిపిన తరువాత ఆయా గ్రామాలకు తిరిగి వెళ్తాయి. ప్రబల తీర్థం ఆనవాతీగా జరుపుకుంటున్నట్లు వివరించారు.

ఈశ్వరుని రూపంగా ప్రబల తీర్థం...

కోన సీమలో ఈశ్వరుని రూపంగా ప్రబలను కొలుస్తారు. వెదురు కర్రలు, రంగు,రంగుల నూతన వస్త్రాలు, కాగితాలతో ప్రబలను తయారు చేస్తారు. అనంతరం వివిధ రకాల పూలతో అలకరించి శివ పార్వతులను ప్రబల్లో ఏర్పాటు చేసి అపర్ణ సరోవర్‌లో ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. ఊరేగింపులో చిన్నారులు, మహిళల కోలాటాలు, భక్తుల హరిహర మహాదేవ నినాదాలతోపాటు సన్నాయి, మేళ తాళాలతో సరోవర్ వాతావరణం మారుమ్రోగింది. సరోవర్ వాసులు పెద్దఎత్తున పాల్గొనడంతో పండుగ వాతావరణం నెలకొంది.



దేవతల వేషధారణలో చిన్నారులు

అభివృద్ధి పనుల పరిశీలన

మియాపూర్ : ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటప్ ఉప్పలపాటి శ్రీకాంత్ పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని జేపీనగర్ కాలనీలో డ్రైనేజీ సమస్య, మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, సమస్య తిరిగి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

శేరిలింగంపల్లిలో 7.47 లక్షల ఓటర్లు

- 8 న తుది ఓటరు జాబితా విడుదల

శేరిలింగంపల్లి: రాష్ట్రంలో అత్యధిక ఓటర్లు ఉన్న నియోజకవర్గంగా శేరిలింగంపల్లి మరోసారి గుర్తింపు పొందింది. శేరిలింగంపల్లిలో ప్రస్తుతం 7,47,671 మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాలలో ఇంత పెద్ద ఎత్తున ఓటర్లు ఉన్న నియోజకవర్గంగా గుర్తింపు సాధించడం విశేషం. ఇందులో 3,95,460 మంది పురుషులు, 3,52,067 మంది స్త్రీలు, 144 మంది థర్డ్ జెండర్ ఓటర్లుగా గుర్తించారు. పార్లమెంటు ఎన్నికల ముందు తుది ఓటరు జాబితాను ఈనెల 8న విడుదల చేసేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది.

కింది కుంట చెరువును అభివృద్ధి చేస్తా

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని కిందికుంట చెరువుకు చేపట్టవలసిన అభివృద్ధి పనులపై ఆదివారం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీతో వాకర్స్ కమిటీ సభ్యులు చర్చించారు. కింది కుంట చెరువును అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.

రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న రంగారెడ్డి జిల్లా ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ ప్రవీణ్‌రావు

రంగారెడ్డి జిల్లా ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ ప్రవీణ్‌రావు

గచ్చిబౌలి: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడకంపై మరింత అవగాహన అవసరమని రంగారెడ్డి జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి ఎం.ప్రవీణ్ రావు పేర్కొన్నారు. ఆదివారం గచ్చిబౌలి స్టేడియం వద్ద రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా అవగాహన బైక్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల్లో మరణించిన వారిలో 80 శాతం మంది ద్విచక్ర వాహనదారులే ఉంటున్నారన్నారు. హెల్మెట్ ధరించకపోవడంతోనే ప్రమాదాల్లో మరణిస్తున్నట్లు లెక్కల్లో స్పష్టమవుతుందన్నారు. కొందరు హెల్మెట్ ధరించినా బెల్టు లాక్ చేయకపోవడంతో ప్రాణాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు. మితి మీరిన వేగంతో వాహనాలను నడపడం సరికాదన్నారు. మద్యం మత్తులో, సెల్‌ఫోన్ మాట్లాడుతూ.. వాహనాలు నడిపితే ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలను పాటించాల్సిన అవసరం ఉందన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రజల సహకారం అవసరమని ఆయన చెప్పారు. కొండాపూర్ ఆర్టీఏ కార్యాలయం వరకు అవగాహన ర్యాలీ కొనసాగింది. ఎంవీఐలు విజయరావు, వాసు తదితరులు పాల్గొన్నారు.

మట్టి టిప్పర్ల పట్టివేత



అధికారులు సీజ్ చేసిన మట్టి టిప్పర్లు

జిన్నారం(పటాన్‌చెరు): అక్రమంగా నల్లమట్టిని తరలిస్తున్న టిప్పర్లను రెవెన్యూ అధికారులు, పోలీసులు ఆదివారం తెల్లవారు జామున పట్టుకున్నారు. నర్సాపూర్ నుంచి గుమ్మడిదల మీదుగా అన్నారం గ్రామానికి నల్లమట్టిని తరలిస్తున్న విషయాన్ని స్థానికులు పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో గుమ్మడిదల తహసీల్దార్ గంగాభవాని ఆదేశాల మేరకు ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి గుమ్మడిదలలోని టోల్‌గేట్ వద్ద 30 టిప్పర్‌లను అదుపులోకి తీసుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో వాటిని సీజ్ చేశామన్నారు. అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. మట్టిని తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లక్ష్మారెడ్డి తెలిపారు.

పారిశుద్ధ్యంపై పట్టింపేదీ..?

రోడ్ల పక్కన, ఖాళీ స్థలాల్లో పేరుకుపోతున్న చెత్త



మియాపూర్‌లోని బీకేఎన్‌క్లేవ్ చెరువు సమీపంలో ..

మియాపూర్ : చందానగర్ సర్కిల్ -21 పరిధిలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. కాలనీ, బస్తీలలో రోడ్ల పక్కన, ఖాళీ స్థలాల్లో చెత్త చెదారం గుట్టలుగా పేరుకుపోయింది. అధికారుల పర్యవేక్షణ లోపం.. పారిశుద్ధ్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా చెత్త పేరుకుపోయింది. రోజుల తరబడి అలాగే వదిలేయడంతో కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతుందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. మియాపూర్, చందానగర్ డివిజన్‌లలో దీప్తిశ్రీనగర్ కాలనీ, ప్రశాంత్‌నగర్ కాలనీ, మక్తమహబూబ్‌పేట, డీకే ఎన్‌క్లేవ్, న్యూ కాలనీ, లక్ష్మీనగర్ కాలనీ, బీకే ఎన్‌క్లేవ్, ఎంఏనగర్ తదితర కాలనీలు, బస్తీలలో రోడ్ల పక్కన చెత్త, చెట్లకొమ్మలు దర్శనమిస్తున్నాయి. మియాపూర్‌లోని మక్తమహబూబ్‌పేట చెరువు, లక్ష్మీనగర్ చెరువు, గురునాథం చెరువు, బీకేఎన్‌క్లేవ్ వద్ద చెరువు కట్టల సమీపంలో చెత్తగుట్టలు గుట్టలుగా పేరుకుపోయింది.

మురుగు సమస్య...

మియాపూర్‌లోని బొల్లారం రోడ్డులో న్యూ కాలనీ వద్ద గత కొన్ని నెలలుగా మురుగునీరు రోడ్డుపై పారుతోంది. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, నామమాత్రంగా బాగు చేసి వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరమ్మత్తులు చేసిన రెండు రోజులకే మరలా మురుగు సమస్య ఉత్పన్నమవుతోందని వాపోతున్నారు.



మియాపూర్‌లోని మక్తమహబూబ్‌పేటలోని చెరువుకట్టపై చెత్త



శ్రీకృష్ణసాయి కాలనీలో..



మియాపూర్‌లోని విశ్వేశ్వర కాలనీలో పోలీస్ స్టేషన్ వెళ్లే రోడ్డులో..

ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శన



శిల్పారామంలో నాట్య ప్రదర్శన చేస్తున్న దృశ్యం

మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న 'నేషనల్ హ్యాండ్‌లూమ్ ఎక్స్‌పో' గాంధీ బుణాకర్ మేళ నిర్వహించారు. ఈ మేళాలో భాగంగా ఆదివారం పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. నృత్యాంజలి స్కూల్ ఆఫ్ డాన్స్ నాట్య గురువు శృతికిరణ్ శిష్యబృందంచే భరతనాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. పుష్పాంజలి, అలరిపు, మూషికవాహన, మహాగణపతి, గణేశపంచరత్న తదితర అంశాలను కళాకారులు అనన్య, ఆద్య, నిత్యశ్రీ, వంశిక, తన్వీ, రియా, శ్రీయ, శాన్వి, పూర్వి, పవిత్ర, హిరణ్య, మహతి, మైత్రి తదితరులు పాల్గొని ప్రదర్శించారు. ప్రముఖ నాట్య గురువులు హరి మంగళంపల్లి, మృదుల ఆనంద్, వైదేహీ సుభాష్, ప్రముఖ సంగీత కళాకారులు నేపథ్య గాయని శ్రీనిధి తిరుమల పాల్గొని కళాకారులను అభినందించారు.

క్రీమ్‌స్టోన్‌లో నటీమణుల సందడి



నటీమణులు ప్రియాంక చౌదరీ, జెన్నీ

గచ్చిబౌలి: కొండాపూర్‌లోని క్రీమ్‌స్టోన్‌లో నటీమనులు ప్రియాంక చౌదరీ, జెన్నీ సందడి చేశారు. వరల్డ్ నటెల్లా డే సందర్భంగా 'ది ఐకానిక్ ఐస్‌క్రీమ్ కాన్సెప్ట్ బ్రాండ్' ను నుటెల్లాతో కలిసి సెలబ్రేషన్స్ చేశారు. న్యూటెలిషీస్ క్రీమ్‌స్టోన్ కాన్సెప్ట్‌లను రూపొందించారు. సరికొత్త కాన్సెప్ట్‌తో తయారు చేసిన ఐస్‌క్రీమ్‌లను రుచి చూశారు.

మదాపూర్‌లో కృతుంగా రెస్టారెంట్ ప్రారంభం



రెస్టారెంట్‌ను ప్రారంభించిన మోడల్స్

మాదాపూర్: భోజన ప్రియులకు అందుబాటులో ఏర్పాటు చేసిన రెస్టారెంట్ ఆకట్టుకుంటుంది. మాదాపూర్‌లో కృతుంగా 60వ రెస్టారెంట్‌ను నటి కుషితకల్లపు, రాశిసింగ్, ప్రియాంకచౌదరిలు నిర్వాహకులతో కలసి ఆదివారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. హైదరాబాద్, బెంగళూరు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, యూఎస్‌ఏ, ఆస్ట్రేలియాలలో రెస్టారెంట్లు ఉన్నాయని తెలిపారు. 60వ రెస్టారెంట్ మాదాపూర్‌లో ఏర్పాటు చేసినట్లు నిర్వాహకుడు అనంత్ పేర్కొన్నారు. నాటుకోటి కూర, బిర్యానీ ప్రత్యేక వంటకాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. పలువురు మోడల్స్, సిబ్బంది పాల్గొన్నారు.

'ఆలీవ్ డెంటల్ వరల్డ్' ఆస్పత్రి ప్రారంభం



ఆస్పత్రిని ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సినీనిర్మాత దిల్‌రాజు

మాదాపూర్: దంతవైద్య రంగంలో సాంకేతిక పరిజ్ఞానం చాలా పెరిగిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. మాదాపూర్‌లోని కాకతీయహిల్స్‌లో ఆదివారం ఆలీవ్ డెంటల్ వరల్డ్ ఆస్పత్రిని ఆయన సినీ నిర్మాత దిల్‌రాజుతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అత్యాధునిక పరికరాలు, కొత్త తరహా పద్ధతులు అద్భుతంగా ఉన్నాయని యాజమాన్యాన్ని కొనియాడారు. రోగులకు నాణ్యమైన చికిత్సను అందించాలని కోరారు. జగిని వెంకన్న, డాక్టర్ ఆదిత్య జగిని, డాక్టర్ పూజసాయి, డాక్టర్ అర్జున్, శ్రీనివాస్, యుగంధర్, కల్వ ఉదయ్ కుమార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమ్మెను జయప్రదం చేయండి




పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాజయ్య తదితరులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16వ తేదీన తలపెట్టిన దేశవ్యాప్త కార్మిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని హెచ్‌ఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వర్ ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొల్లూరి సత్తయ్య పిలుపునిచ్చారు. ఆదివారం భెల్ కాలనీలో ఏర్పాటు చేసిన హెచ్‌ఎంఎస్ ముఖ్య నేతల సమావేశానికి హాజరై మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసేందుకు మోదీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. గతంలో ప్రధానంగా 18 డిమాండ్ల సాధనకై అనేక పోరాటాలు చేసినా పాలకులు పట్టించుకోలేదన్నారు. డిమాండ్ల సాధనకు ఈనెల 16వ తేదీన దేశవ్యాప్త సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అసంఘటిత కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. హమాలీలకు, పంచాయతీ కార్మికులకు, మెకానిక్‌లకు, స్కీం వర్కర్లకు ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. పాలకులు వెంటనే నాలుగు లేబర్ కోడ్స్, విద్యుత్ సవరణ బిల్లు 2022ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. గ్యారంటీతో కూడిన సేకరణతో పాటు అన్ని వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర ఉండేలా చట్టబద్ధత కల్పించాలన్నారు. కార్యక్రమంలో భెల్ బీఎంయూ అధ్యక్షుడు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి నరేందర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం

జిన్నారం(పటాన్‌చెరు): కేంద్ర ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని, వీటిపై అలుపెరగని పోరాటం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాజయ్య పిలుపునిచ్చారు. ఈనెల 16వ తేదీన తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మె వాల్‌పోస్టర్‌ను గుమ్మడిదల మండలం బొంతపల్లిలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్‌రెడ్డి, శ్రీధర్‌రావు, వెంకటేశ్వర్లు, వెంకటేశ్‌గౌడ్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివితే లక్ష్యం చేరుకోవచ్చు



పటాన్‌చెరు టౌన్: విద్యార్థులు పట్టుదలతో చదివితే లక్ష్యాన్ని చేరుతారని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్ అన్నారు. ఆదివారం పటాన్‌చెరు పట్టణంలోని డిగ్రీ కళాశాలలో బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం అభ్యాస కేంద్రం-36 లో మొదటి సంవత్సరం అభ్యాసకులకు అవగాహన సదస్సు నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమయపాలన పాటించడంతోపాటు ప్రణాళికాబద్ధంగా చదువుకొని ఉన్నతమైన స్థానంలో నిలవాలని కోరారు.